క్లుప్తంగా

వరద బాధితులకు ప్రత్యేక ఏర్పాట్లు



వరద బాధితులకు పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న మున్సిపల్ అధికారులు

వేములవాడ: భారీ వర్షాల కారణంగా వేములవాడ పట్టణ శివారులోని లోతట్టు ప్రాంతమైన బేడ బుడగజంగాల కాలనీలోకి వరద చేరడంతో జిల్లా అధికార యంత్రాగం, మున్సిపల్ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పట్టణ శివారులోని హరిహర పంక్షన్‌హాలులో బాధితులకు వసతి కల్పించారు. మంగళవారం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ తమ సిబ్బందితో కలిసి బాధితులకు భోజనం వడ్డించారు. రెండుపూటలా భోజనం, బియ్యం, ఇతర వంట సామగ్రి అందించినట్లు బాధితులు తెలిపారు.

రుణమాఫీపై రైతుల ఆందోళన



నిరసన తెలుపుతున్న రైతులు

ముస్తాబాద్: ప్రభుత్వం హామీ ఇచ్చిన రూ.2లక్షల రుణమాఫీ చేయాలని ముస్తాబాద్ రైతువేదిక ఎదుట రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. ముస్తాబాద్, బందనకల్, మద్దికుంట, తెర్లుమద్ది గ్రామాలకు చెందిన రైతులు రైతువేదికలో ఉన్న వ్యవసాయాధికారులతో మాట్లాడారు. రూ.2లక్షల రుణమాఫీ ఇంకా కాలేదని, తమకు సమాచారం రాలేదని అధికారులు పేర్కొనడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ, రూ.2లక్షల కంటే ఎక్కువగా రుణాలు తీసుకున్నామని, రూ.2లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని చెల్లించామన్నారు. అయినా తమకు రుణమాఫీ వర్తింపచేయడంలో అధికారులు విఫలం అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు లక్షల కంటే ఎక్కువగా రుణం తీసుకున్న రైతులకు తక్షణమే ఆ రుణాన్ని మాఫీ చేసి ఆదుకోవాలని కోరారు. రెండు లక్షల పైన ఉన్న మొత్తాన్ని పదిరోజుల క్రితమే చెల్లించామన్నారు. రేషన్‌కార్డు, ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకాలలో తప్పుగా నమోదైన పేర్లతో కొంతమందికి మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయశాఖ, బ్యాంక్ అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. రైతులు బిల్లం స్వామి, ఈర్ల కనుకయ్య, ఎల్లారెడ్డి, చింతల రాజు, చిగురు మహేశ్, నవీన్, చంద్రయ్య, సైపుద్దీన్, జగన్‌మోహన్ రావు, కుంటయ్య తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

వేములవాడరూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మంగళవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలపై పలుసార్లు వినతిపత్రాలు అందజేసినా పరిష్కారం చూపకపోవడంతో ఈనెల 9న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమస్యలు రిష్కరించకపోతే అక్టోబర్ 14న నిరవధిక సమ్మెకు నోటీసు అందిస్తామన్నారు. సీపీఐ నాయకులు కడారి రాములు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన



తిమ్మాపూర్ తూమును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని ఆయాగ్రామాల్లో చెరువులను తహసీల్దార్ రామచంద్రం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాచర్లతిమ్మాపూర్ మైసమ్మ చెరువుతూమును పరిశీలించి తూము నుంచి వరదనీరు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ఎల్లారెడ్డిపేట: బండలింగంపల్లికి చెందిన కిషన్ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనకు మెరుగైన వైద్యంకోసం రూ.1.50లక్షల ఎల్‌వోసీని అందించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కిషన్ పరిస్థితిని వివరించగా, వారి ప్రత్యేక చొరవతో నిమ్స్‌లో ఎల్‌వోసీ మంజూరు చేయించారని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

గుంతల రోడ్డుపై వెళ్లేదెలా?



ఇల్లంతకుంట: మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి ఇది. ఇల్లంతకుంట నుంచి తంగళ్లపల్లి వరకు 19 కిలోమీటర్లు ఉంటుంది. రహీంఖాన్‌పేట నుంచి వెల్జిపూర్ వరకు, గండి పోచమ్మ ఆలయం నుంచి తంగళ్లపల్లి వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. అడుగడుగునా గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

పడిపోతే అంతే..



వేములవాడఅర్బన్: వేములవాడ మూలవాగు పక్కన ఉన్న రెండో బైపాస్ రోడ్డు ప్రారంభంలో ఉన్న గుంత ప్రమాదకరంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్డంతా గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. రాత్రిపూట వాహనదారులు గుంతలోపడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి ఈ రోడ్డుపై గుంతను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.



సిరిసిల్ల: పట్టణంలోని శాంతినగర్‌లో మురుగుకాల్వను శుభ్రం చేయడం లేదు. మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది నిర్లక్ష్యంతో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఎప్పటికప్పుడు మురుగు కాల్వను శుభ్రం చేయాల్సిన సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కాల్వను శుభ్రం చేయాలి.
– గౌరీ శంకర్, శాంతినగర్, సిరిసిల్ల

సంప్రదించాల్సిన అధికారి: మీర్జా ఫసత్ అలీబేగ్, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల, ఫోన్: 9849905879

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

వేధింపులకు పాల్పడితే చర్యలు



వేములవాడ రూరల్ : నూకలమర్రిలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై మారుతి

ముస్తాబాద్: బాలికలపై వేధింపులకు పాల్పడితే చర్యలు తీసుకుటామని ఎస్సై గణేశ్ హెచ్చరించారు. మండలంలోని మద్దికుంట ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. బ్యాడ్ టచ్, గుడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని చెక్కపల్లి, నూకలమర్రి గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం పోక్సోచట్టంపై ఎస్సై మారుతి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులు కొత్త చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమకు తెలపాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: విద్యార్థులు పోక్సో చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై దాస సుధాకర్ అన్నారు. పద్మనగర్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ఇందిరమ్మకాలనీ తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో పోక్సో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలబాలికలపై లైంగిక వేధింపులు నివారించేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. బ్యాడ్ టచ్ గుడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ అధికారి ఏ.శ్యామల, గిరిజన గురుకులం ప్రిన్సిపాల్ శకుంతల, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇళ్లు



తంగళ్లపల్లి: బస్వాపూర్‌లో కూలిపోయిన ఇల్లు

తంగళ్లపల్లి: మండలంలోని బస్వాపూర్‌లో మూడు రోజులపాటు కురిసిన వర్షాలకు గొడిశెల మల్లయకు చెందిన పెంకుటిల్లు మంగళవారం కూలిపోయింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలో మంగళవారం మరో ఏడు ఇళ్లు కూలిపోయాయి. అల్మాస్‌పూర్‌లో మల్లారపు లక్ష్మి ఇల్లు కూలిపోవడంతో కుటుంబ సభ్యులను రెవెన్యూ అధికారులు అంబేడ్కర్ భవనంలోకి తరలించారు. ఇళ్లు కూలిపోయి నిరాశ్రయులైన వారికి తహసీల్దార్ రామచంద్రం నిత్యావసరాలు అందజేశారు. మండలంలోని పలుగ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లవారు, లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న వారిని అ ధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బాధిత కుటుంబాలను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య ఆధ్వర్యంలో నాయకులు పరామర్శించారు.



ఎల్లారెడ్డిపేట: అల్మాస్‌పూర్‌లో లక్ష్మి కుటుంబానికి నిత్యావసరాలు అందిస్తున్న రెవెన్యూ అధికారులు

మత్తడి దూకుతున్న చెరువులు



ముస్తాబాద్: మత్తడి పోస్తున్న బందనకల్ ఊరచెరువు

ముస్తాబాద్: మండలంలో భారీ వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరి మంగళవారం మత్తడి దూకాయి. ముస్తాబాద్ పెద్ద చెరువు, గూడెంలో కొండ చెరువు, చింతల చెరువు, ఆవునూర్‌లో పెద్ద చెరువు, బందనకల్‌లో ఊర చెరువులు మత్తడి దూకుతున్నాయి. పోతుగల్, గన్నెవారిపల్లె మధ్య ఎల్లమ్మ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడ నిర్మిస్తున్న వంతెన పనులు పూర్తికాలేదు. తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో గన్నెవారిపల్లె ప్రజలు ముస్తాబాద్‌కు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రామలక్ష్మణపల్లె, పదిర గ్రామాల మధ్య మానేరు వాగు ఉధృతంగా ప్రవహించడంతో, రాకపోకలు నిలిచిపోయాయి. మాజీ జెడ్పీటీసీ గుండం నర్సయ్య, మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి మానేరు వాగులో పూజలు చేశారు.

పెద్ద చెరువుతో ఉపాధి

ముస్తాబాద్: ముస్తాబాద్ పెద్ద చెరువు నిండడంతో మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని మత్స్యకారుల సంఘం బాధ్యుడు పూస బాలయ్య అన్నారు. భారీ వర్షాలకు నిండిన పెద్ద చెరువునును మంగళవారం పరిశీలించారు. చెరువు నుంచి చేపలు మత్తడి నుంచి దూకకుండా జాలీలను మత్స్యకారులు అమర్చారన్నారు. గతేదాది టన్నుల కొద్దీ చేపలు మత్తడి దూకి వెళ్లాయన్నారు. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, నాని, రహ్మతుల్లా తదితరులు ఉన్నారు.

7 నుంచి రాజన్న ఆలయంలో గణేశ్ నవరాత్రోత్సవాలు

వేములవాడ: రాజన్న ఆలయంలో ఈనెల 7 నుంచి 15వ తేదీ వరకు గణేశ్ నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7న ఉదయం 9 గంటలకు నాగిరెడ్డి మండపంలో పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, సిద్ధిబుద్ధి వినాయక ప్రతిష్ఠ, నవరాత్రుల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అభిషేకాలు, అర్చనలు, గణేశపురాణ ప్రవచనం జరిపిస్తామన్నారు. ఈనెల 14న ఉదయం 9 గంటలకు మూలమంత్ర హవనం, రాత్రి 7.15 గంటలకు లక్ష్మీగణపతికి మహాపూజ, ఈనెల 15న హవనానంతరం, 11 గంటలకు పూర్ణాహుతి, రాత్రి 7.15 గంటలకు పెద్దసేవలపై ఊరేగింపు అనంతరం గణేశ్ నిమజ్జనోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

చందుర్తి: కులం పేరుతో దూషించిన కేసులో వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి మంగళవారం సాయంత్రం విచారణ చేపట్టారు. చందుర్తి మండల కేంద్రానికి చెందిన మార్త సత్తయ్య ఇదే గ్రామానికి చెందిన మేడికాల దేవరాజును పొలం వద్ద వచ్చిన హద్దులను దృష్టిలో పెట్టుకుని కులం పేరుతో సత్తయ్య దూషించాడని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై ఏఎస్పీ విచారణ చేపట్టారు. ఏఎస్పీ వెంట ఏఎస్సై బాపు ఉన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

బోయినపల్లి: వైద్యంకోసం ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లే పేదల బలహీనతను ఆసరాగా చేసుకొని పెద్ద మొత్తంలో బిల్లులు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కన్వీనర్ గురజాల శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా లేకపోవడంతో రూ.లక్షల్లో బిల్లులు వేసి పేదల నడ్డి విరుస్తున్నారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల ఆగడాలకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



వీర్నపల్లి: మండలంలోని రెండు గ్రామాలల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. వన్‌పల్లి గ్రామానికి చెందిన తడగొండ వర్షకి రూ.24వేలు, ఎర్రగడ్డ తండా గ్రామానికి చెందిన అంబిబాయి రూ. 40వేల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు రాములు నాయక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు తిరుపతి యాదవ్, సీనియర్ నాయకులు నందగిరి శ్రీనివాస్, ప్రకాశ్ నాయక్, బానోతు రాజు నాయక్, నక్క శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కొండాపూర్ గ్రామానికి చెందిన మద్దెల రాజేశ్‌కు సీఎంసహాయనిధి నుంచి మంజూరైన రూ.14వేల చెక్కును అందజేశారు. సింగిల్ విండో మాజీ చైర్మన్ కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, నాయకులు యశోద వేణు, వైకుంఠం, వేణు, శ్రీనివాస్, శంకర్, జలేందర్, లింగారెడ్డి, రత్నాకర్ పాల్గొన్నారు.

108లో మహిళ ప్రసవం

వేములవాడ: పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ మహిళను ఆస్పత్రికి తరలిస్తుండగా 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన గోరెబీ పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108కు సమాచారం అందించారు. ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో అంబులెన్స్‌లోనే బిడ్డకు జన్మనిచ్చింది. సిబ్బంది డెలివరి చేసి తల్లీబిడ్డను మెరుగైన వైద్యంకోసం వేములవాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. సిబ్బందికి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుపై మొరాయించిన పోలీస్ వాహనం



చందుర్తి: చందుర్తి పోలీస్‌స్టేషన్ వాహనం మంగళవారం రోడ్డుపై మొరాయించింది. పెట్రోలింగ్ వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పోలీసు స్టేషన్ శివారులో నిలిచిపోయింది. దీంతో దారిన వెళ్లే యువకులతో పాటు పోలీసు సిబ్బంది వాహనాన్ని స్టేషన్ వరకు నెట్టుకెళ్లారు.

వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం అంతంత మాత్రమే భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు వసతి గదుల సమాచారం.

కాంప్లెక్స్ పేరు	ఖాళీల సంఖ్య	అద్దె రూ.
అమ్మవారి కాంప్లెక్స్	03	1,680
భీమేశ్వర సదన్ ఏసీ	21	1,344
భీమేశ్వర సదన్ సూట్స్	05	1,680
భీమేశ్వర గెస్ట్‌హౌస్	03	2,800
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	12	1,008
నందీశ్వర నాన్‌ఏసీ	29	560
నందీశ్వర సూట్స్	04	2,800
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	33	448
పార్వతీపురం స్పెషల్	19	672
పార్వతీపురం సాధారణ	30	336

- వేములవాడ

పాత బ్రిడ్జి కూల్చివేతపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న మృత్యుంజయం

గంభీరావుపేట: గంభీరావుపేట, లింగన్నపేట గ్రామాల మధ్య మానేరువాగుపై ఏళ్ల క్రితం నిర్మించిన పాత బ్రిడ్జిని కూల్చివేసిన ఘటనపై విచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం అన్నారు. మానేరు వాగు ఉధృతితో నీట మునిగిన రోడ్డును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. కొత్త బ్రిడ్జి నిర్మిస్తామని పాత బ్రిడ్జి కూల్చివేసి దానిలోని ఇనుప చువ్వలను ఏం చేశారో అధికారులకే తెలపాలన్నారు. అధికారులు, కాంట్రాక్టర్‌కు ముందుచూపు లేకపోవడంతో ప్రస్తుతం ప్రజలు రవాణాసౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వరద ప్రవాహానికి ప్రస్తుతం బ్రిడ్జి లేకపోవడంతో ఎన్నినెలలు పడుతుందో తె లియడం లేదన్నారు. అధికారుల, కాంట్రాక్టర్ తీరుపై ప్రభుత్వానికి నివేదించి విచారణ చేపట్టాలన్నారు.

'ఉపాధిహామీ సామాజిక తనిఖీ'

రుద్రంగి: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులపై అధికారులు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డీఆర్డీవో శేషాద్రి హాజరయ్యారు. 2023 మార్చి నుంచి 2024 ఏప్రిల్ వరకు ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనుల వివరాలను అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేపట్టిన తర్వాత పంచాయతీ కార్యదర్శులు కూలీల నుంచి మస్టర్‌లో సంతకాలు తీసుకోవాలన్నారు. పంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి రికవరీ, జరిమానా విధించారు. మండలంలో రూ.2కోట్ల 60 లక్షల పనులు చేపట్టినట్లు తెలిపారు. విజిలెన్స్ ఆఫీసర్ రామారావు, డీఈ పవనకుమారి, ఏఈ మనోహర్, ఎంపీడీవోలు శంకర్, నటరాజ్, ఎంపీవో సుధాకర్, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ

కోనరావుపేట: మండలంలోని సుద్దాలకు చెందిన వాలీబాల్ క్రీడాకారులకు గ్రామానికి చెందిన కచ్చకాయల మహేశ్ టీషర్టులు అందజేశారు. సొంతంగా రూ.5వేలు వెచ్చించి టీషర్టులు అందజేశారు. మాదిగసంఘం అధ్యక్షుడు దొబ్బల దేవయ్య, అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు శంకర్, సంజీవ్, వంగాల భూమేశ్, సామెల్, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో జయశీల

బోయినపల్లి: విద్యార్థులకు విద్యతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో బీమా జయశీల పేర్కొన్నారు. ఎమ్మార్సీ భవనంలో యూడైస్ ప్లస్ (డీసీఎఫ్)పై పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నోడల్ అధికారి ఎస్. శ్రవణ్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున విద్యార్థుల ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సూచించారు. నోడల్ అధికారి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ యూడైస్ ప్లస్‌లో పాఠశాలకు సంబంధించిన పూర్తి సమాచారం నింపాలని కోరారు. నిజాం ఇనిస్టిట్యూట్ నుంచి వచ్చిన ఫిజియోథెరపిస్ట్ చల్ల రమేశ్, డాక్టర్ మయూరి ఆరోగ్య సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ టీచర్ సురేంద్రస్వామి, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బి. శ్రీనివాస్, ఉషారాణి, జీ.సత్యనారాయణ, సీసీవో శ్రీపతి చంద్రమౌళి, ఎంఐఎస్ రజిత, ఐఈఆర్పీ నరేందర్, సీఆర్పీలు తిరుపతి, శ్రీనివాస్ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

● **లక్కీడ్రాలను నమ్మి మోసపోవద్దు**

వేములవాడ: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొందరు ఎలక్ట్రికల్ షాప్ యజమానులు లక్కీడ్రాలు, స్కీముల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారన్న సమాచారంతో మంగళవారం పట్టణంలోని కొన్ని ఎలక్ట్రికల్ షాపులను తనిఖీ చేసినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. కొంతకాలంగా టౌన్ పరిధిలో ఎలక్ట్రికల్ షాప్ యజమానులు స్కీములు, లక్కీడ్రాల పేరుతో సామాన్య ప్రజల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారన్నారన్నారు. ప్రతినెలా కొందరి వద్ద డబ్బులు వసూలు చేసి, ఒక్కొక్కరు చొప్పున కొందరికి డబ్బులు ఇస్తూ మిగతావారికి తర్వాత ఇస్తామని నమ్మించి బోర్డు తిప్పేసే అవకాశం ఉందన్నారు. అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు.

● **వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు**

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అక్కపల్లి నంది కమాన్, రాచర్లగొల్లపల్లి గ్రామ శివారులో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రగాయాలకు గురయ్యారు. వివరాలు.. వీర్నపల్లి మండలం కంచర్లకు చెందిన దుండిగాల తిరుపతి దంపతులు ద్విచక్ర వాహనంపై ఎల్లారెడ్డిపేటకు వస్తుండగా, రోడ్డుపై కుక్కలు అడ్డుగా రావడంతో కిందపడి గాయాలకు గురయ్యారు. వారిని కాంగ్రెస్ నాయకులు 108 వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించారు. రాచర్లబొప్పాపూర్‌లో ట్రాలీ ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు తీవ్ర గాయాలకు గురికాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

● **లబ్ధిదారులకు అవగాహన**

వేములవాడరూరల్: వేములవాడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ముర్ర గేదెలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి హాజరైన పలువురు లబ్ధిదారులకు ఎస్సీ కార్పొరేషన్ కింద మంజూరయ్యే యూనిట్లపై అవగాహన కల్పించారు. బ్యాంకు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

● **ముస్తాబాద్ ఎంపీడీవోగా శ్రీనివాస్**

ముస్తాబాద్: ముస్తాబాద్ ఎంపీడీవోగా శ్రీనివాస్ బదిలీపై వచ్చారు. సిరిసిల్ల కలెక్టరేట్‌లో మెప్మా సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను ముస్తాబాద్ ఎంపీడీవోగా బదిలీ చేస్తూ పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీచేశారు. ఇంతకుముందు ఉన్న ఎంపీడీవో భాస్కర్‌శర్మ దుబ్బాకకు బ దిలీపై వెళ్లారు. ఇల్లంతకుంట మండల సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాస్‌ను చందుర్తి ఎంపీడీవో బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

● **మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు**

తంగళ్లపల్లి: మద్యంతాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై సుధాకర్ అన్నారు. మంగళవారం రాత్రి మండలకేంద్రంలో వాహనాల తనిఖీ చేశారు. డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి పలువురిపై కేసులు నమోదు చేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

● **రోడ్డుపై గుంత పూడ్చివేత**

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్ల–బావుసాయిపేట మధ్య ప్రధాన రోడ్డు భారీ వర్షాలకు కోతకు గురై గుంతమయంగా మారింది. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా సొంత ఖర్చులతో గుంతలో మొరం పోయించాడు. జిల్లా కార్యదర్శి నందూగౌడ్, శ్రీనివాసరావు తదితరులున్నారు.

● **ఉపాధ్యాయులకు అవగాహన**

గంభీరావుపేట: మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులకు బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం యూడైస్–2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి డాటా ఎంట్రీపై అవగాహన సదస్సు నిర్వహించారు. నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిజియోథెరపీ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై శిక్షణనిచ్చారు. మండల నోడల్ అధికారి గంగారాం, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, బాల ఎల్లయ్య, రిసోర్స్ పర్సన్ ఎర్ర ప్రవీణ్‌కుమార్, ఎమ్మార్సీ సిబ్బంది దస్తగిరి, రాజు, సీఆర్పీలు పాల్గొన్నారు.

● **వర్షానికి దెబ్బతిన్న బీటీ రోడ్డు**

గంభీరావుపేట: మండలంలోని మల్లారెడ్డిపేట నుంచి కోరుట్లపేటకు వెళ్లే బీటీరోడ్డు భారీ వర్షాలకు దెబ్బతింది. వరదనీటి ప్రవాహానికి సైడ్‌బర్మ్ కొట్టుకుపోయింది. వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

● **పరామర్శ**

ఎల్లారెడ్డిపేట: దుమాలకు చెందిన మాజీ సర్పంచ్ రామిండ్ల మోషయ్య అనారోగ్యంతో మృతిచెందగా బా.దిత కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ నా యకులు పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ అ. ధ్యక్షుడు నర్సయ్య, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, శ్రీనివాస్, తదితరులన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
సిరిసిల్ల జిల్లా:
9951602934, 9010610963
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
సిరిసిల్ల : రఘు - 7331119957
వేములవాడ : నవీన్ - 7997958211
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899